RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 286 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్ శుక్రవారం 21 జూన్ 2024



# ఒక ఉన్మాది విధ్వంసం నుండి..
# అభివృద్ధి వైపు అమరావతి..!



- నాడు పుణ్యనదుల నుంచి తెచ్చిన నీరు, మట్టి వల్లనే నేడు మళ్లీ అమరావతి నిలబడింది.
- 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన ఏకైక ప్రాజెక్టు అమరావతి.
- 80 శాతం పూర్తి అయిన నిర్మాణాలను అలాగే వదిలేశారు.
- రాజధాని పనులపై వైట్ పేపర్ విడుదల చేస్తాం...అందరి సహకారంతో,ముందుకు పోతాం.
- నాలుగు గంటల పాటు అమరావతిలో సీఎం పర్యటన....రాజధాని భవనాల పరిశీలన.
- ఏపీ సీఎం నారాచంద్రబాబు నాయుడు.

మిగతా 2లో

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 20: రాష్ట్రానికి అమరావతి, పోలవరం సంపద సృష్టి కేంద్రాలని...గత పాలకుల మూర?త్వం వల్ల రెండూ విధ్వంసానికి గురయ్యాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారాజధాని అమరావతిని అపహాస్యం చేసి విధ్వంసం సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో తన రెండో పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు గురువారం అమరావతి రాజధానిలో పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన, విధ్వాంసాలకు గురైన నిర్మాణాలు, శిథిలాలను పరిశీలించారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చిన ఉండవల్లిలోని ప్రజావేదిక శిథిలాలను మొదట పరిశీలించారు. అక్కడి నుండి బయలుదేరి ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా నాడు రాజధానికి భూమిపూజ జరిగిన వేదిక వద్ద మోకాళ్లపై ప్రణమిల్లారు. అక్కడ నుంచి బయలుదేరి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మించిన గృహాలను పరిశీలించారు. తరువాత ఆలిండియా సర్వీసెస్ న్యాయమూర్తుల కోసం నిర్మించిన భవన సముదాయాలు పరిశీలించారు.

## గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు
## సైన్స్ అండ్ టెక్నాలజీపై ఆసక్తి పెంచుదాం

- ప్రతిభ ఉన్న వారిని తగిన విధంగా ముందుకు తీసుకువెళ్దాం.
- ఏపీ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ అధికారులతో సమీక్షలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.

**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 20:**
గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించే దిశగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ అధికారులు పని చేయాలని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు సూచించారు. తనకు కేటాయించిన శాఖలపై వరుస సమీక్షల్లో భాగంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు గురువారం సాయంత్రం రాష్ట్ర శాస్త్ర సాంకేతిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విజన్ 2047కు అనుగుణంగా భవిష్యత్ ఇన్నోవేషన్ కు అనుగుణంగా పిల్లలను తగిన నైపుణ్యవంతులుగా తీర్చే దిద్దే ప్రయత్నం వేగంగా సాగాలని స్పష్టం చేశారు. పిల్లలకు శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆసక్తి కల్పించడంపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాల్లో చాలా ప్రతిభ ఉంటుందని దానిని వెలికితీసేలా భారీ వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడానికి సన్నద్ధం కావాలని సూచించారు. పిల్లలను పూర్తి స్థాయిలో నైపుణ్యవంతులుగా తయారు చేయడమే కాకుండా వారు



శాస్త్రవేత్తలుగా మారేందుకు అవసరం అయిన ప్రోత్సాహం అన్ని విధాలుగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వైజ్ఞానిక ప్రదర్శనలు పూర్తి స్థాయిలో జరగాలని దీనివలన రాబోయే తరాల్లో సైన్స్ పట్ల మక్కువ పెరుగుతుందని చెప్పారు. శాఖపరమైన అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రాజమండ్రి ఎస్ఆర్ఎస్సీ ప్రాంతీయ వైజ్ఞానిక కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విషయాన్ని అధికారులు తెలిపారు. కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువద్దామని ఉప ముఖ్యమంత్రివర్యులు చెప్పారు.

## జగన్ అక్రమాస్తుల కేసుపై విచారణకు
## సిద్ధమవుతున్న సీబీఐ కోర్టు.!

- వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులపై సీబీఐ కోర్టులో విచారణ జరిగింది.
- ఛార్జిషీట్ల వారీగా డిశ్చార్జి పిటిషన్లపై మళ్లీ విచారణ జరపాలని నిర్ణయించింది.
- సీబీఐ, ఈడీ కేసుల్లో జగన్ సహా 130 పిటిషన్లపై పదేళ్లుగా విచారణ జరుగుతోంది.



ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 20:
జగన్ అక్రమాస్తుల కేసులో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ మళ్లీ మొదటి నుంచి మొదలైంది. ఇవాళ అరబిందో ఛార్జిషీట్?లో జగన్ వేసిన డిశ్చార్జి పిటిషన్?పై వాదనలు ప్రారంభమయ్యాయి. జగన్ తరపు న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు. తదుపరి వాదనల కోసం విచారణను సీబీఐ కోర్టు రేపటికి వాయిదా వేసింది. ఛార్జిషీట్ల వారీగా డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు వినాలని న్యాయస్థానం నిర్ణయించింది.అదే విధంగా సీబీఐ 11, ఈడీ 9 ఛార్జిషీట్ల సారాంశం, డిశ్చార్జి పిటిషన్లు, ఇప్పటి వరకు జరిగిన విచారణ తీరును కొత్త జడ్జి టి.రఘురాం న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. రేపటి నుంచి ఛార్జిషీట్ల వారీగా డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు వినాలని న్యాయస్థానం నిర్ణయించింది. సీబీఐ, ఈడీ ఛార్జిషీట్లలో జగన్, ఇతర నిందితులు కేసు నుంచి తమను తొలగించాలంటూ వేసిన 130 డిశ్చార్జి పిటిషన్లు పదేళ్లుగా పెండింగులో ఉన్నాయి.

**మిగతాది 2లో...**

## ఏపీ అసెంబ్లీ ప్రోటెమ్ స్పీకర్ గా
## గోరంట్ల ప్రమాణస్వీకారం.!

**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 20 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ప్రోటెం స్పీకర్ గా సీనియర్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి నియమితులయ్యారు.ఆయనతో రాష్ట్ర గవర్నర్అబ్దుల్ నజీర్ గురువారం సాయంత్రం రాజ్ భవన్ లోని దర్బార్ హాల్ లో ప్రమాణ స్వీకారం చేయించారు.ప్రస్తుతం గోరంట్ల బుచ్చయ్య చౌదరి%ొ% రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రోటెం స్పీకర్ గా ప్రమాణ




స్వీకారం చేయడంపై మంత్రులు, శాసనసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. రేపటి నుండి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రోటెం స్పీకర్ గా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు. ఈ సందర్భంగా ప్రోటెం స్పీకర్ గా తనతో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ కు కృతజ్ఞతలు తెలిపారు.
గవర్నర్ చేత ప్రొటెం స్పీకర్ గా ఎంపికైన గోరంట్ల బుచ్చయ్య చౌదరి నియామక పత్రాన్ని ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సెక్రటరీ జనరల్ పిపికె. రామాచార్యులు సభలో చదివి వినిపించారు.ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, టీజే భరత్, సవిత, ఎం.రాం ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరంట్లకు పలువురు అభినందనలు తెలిపారు.

## ఏపీలో ముగ్గురు ఐపీఎస్ ల ట్రాన్స్ఫర్.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 20:
ఆంధ్రప్రదేశ్ లో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఉన్నతాధికారుల బదిలీలు జోరుగా సాగుతున్నాయి. రెండు రోజుల క్రితమే ప్రభుత్వం ఐఏఎస్ అధికారులకు స్థాన చలనం కలిగించింది.తాజాగా ఐపీఎస్ ఆఫీసర్లను కూడా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హాయాంలో డీజీపీగా పని చేసిన కసిరెడ్డి వి.రాజేంద్రనాథ్ రెడ్డిని ప్రింటింగ్, స్టేషనరీ అండ్ స్టోర్స్ పర్చేస్ కమిషనర్గా ప్రభుత్వం నియమించింది. జగన్ ప్రభుత్వ హాయాంలో సస్పెన్షన్ కు గురై న్యాయపోరాటం చేసి తిరిగి ఉద్యోగంలో చేరిన ఏబీ వెంకటేశ్వరరావు.. ఒక్క రోజు డ్యూటీ చేసి ఎక్కడైతే రిటైర్ అయ్యారో అదే పోస్ట్ మాజీ డీజీపీ రాజేంద్రనాధ్ రెడ్డికి ఇచ్చారు.ఫైర్ డీజీ సునీల్ కుమార్ను జీఏడీకి రిపోర్ట్ చేయమని ఆదేశించింది. శంఖబ్రాత బాగ్చీకి ఫైర్ సర్వీసెస్ అదనపు బాధ్యతలు అప్పగించారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా ఉన్న వై రిషాంత్ రెడ్డిని డీజీపీ ఆఫీస్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈయన ప్రస్తుతం టాస్క్ ఫోర్స్ ఎస్పీగా అదనపు బాధ్యతల్లో ఉండగా వాటి నుంచి కూడా రిలీవ్ చేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్, టాస్క్ ఫోర్స్ లో ఖాళీ అయిన స్థానాల బాధ్యతలను కొత్త వారిని నియమించే వరకూ ఇతరులకు ఇవ్వాలని డీజీపీ ఆఫీసుకు నిర్దేశించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఏపీ నూతన డీజీపీగా ద్వారకా తిరుమలరావు నియామకం.

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 20:
ఏపీ కొత్త డీజీపీగా ద్వారక తిరుమల రావు నియామకమయ్యారు. ప్రస్తుతం ఆయన ఏపీఎస్ ఆర్టీసీ ఎండీగా సేవలుందిస్తున్నారు. ఆయనను డీజీపీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ద్వారక తిరుమల రావు 1989 బ్యాక్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన 2021 జూన్ నెలలో ఆర్‌టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌పీ ఠాకూర్ పదవీకాలం మే 31న ముగియడంతో ఆయనకు అప్పటి వైఎస్ జగన్ సర్కారు ఆర్‌టీసీ ఎండీగా బాధ్యతలు అప్పగించింది.
ఆయన మూడేళ్లుగా ఆర్టీసీ ఎండీగా పని చేస్తున్నారు. అంతకుముందు రైల్వేశాఖలో డీజీపీగా పని చేశారు. విజయవాడ సీపీగానూ సేవలందించారు. గతంలో విజయవాడ సీపీగా చేసిన గౌతమ్ సవాంగ్‌ను జగన్ సర్కారు డీజీపీ చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు డీజీపీగా



ఉన్న కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిపై ఈసీ బదిలీ వేటు వేసింది. ఆ సమయంలో ద్వారకా తిరుమలరావును ఏపీ డీజీపీగా నియమించే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. అనూహ్యంగా హరీశ్‌కుమార్ గుప్తాకు ఏపీ పోలీస్ బాస్‌గా అవకాశం దక్కింది. దాంతో మే 6న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సంఘం నిర్ణయంతో ఎన్నికల నిర్వహణ మొత్తం హరీష్ గుప్తా డీజీపీ కొనసాగారు. ఇటీవల ఏపీలో చంద్రబాబు నేతృత్వంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతతం ఏపీలో ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీల పర్వం కొనసాగుతున్నది. రాజేంద్రనాథ్ రెడ్డిని బదిలీ చేసిన అనంతరం సీనియర్లు అయిన అంజనా సిన్హా, ఎం ప్రతాప్ లను కాదని హరీష్ ను పోలీస్ బాస్‌గా ఈసీ నియమించింది. కొత్తగా ఏర్పాటైన చంద్రబాబు ప్రభుత్వం ఏపీఎస్ ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకా తిరుమలరావును రాష్ట్ర డీజీపీగా నియమించింది. అలాగే తిరుమలరావు సీనియార్టీ ప్రకారం ఆయనకు పోలీస్ బాస్ అవకాశం దక్కింది. గత సర్కారుతో అంటకాగిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కీలక శాఖలను తప్పిస్తున్నది

# ఏపీలో రెండో భాషగాఉన్న ఉర్దూను అమలు పరచాలి

## -ఏఐఎంఐఎం నంద్యాల ఇంచార్జ్ అక్బర్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:
ఆంధ్రప్రదేశ్లో రెండవ భాషగా ఉన్న ఉర్దూను అమలుపరచాలనిఆల్ ఇండియా మజ్లిస్ ఎ - ఇతేహదుల్ ముస్లిమీన్ తరపున నుంచి న్యాయ మరియు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ ఎండి ఫారుక్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఏఐఎంఐఎం నంద్యాల నంద్యాల నియోజకవర్గం ఇంచార్జ్ అక్బర్ హుస్సేన్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్లో ఉర్దూ రెండవ భాష గా చేసిన విషయం మనందరికీ తెలిసిందే, కానీ రాష్ట్రము లోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల పై మరియు శాసన సభ్యుల బోర్డుల పై, అలాగే రాష్ట్ర మంత్రుల



పేర్ల బోర్డుల పై, అలాగే ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి పేర్లను ఉర్దూ భాషలో కూడా పెట్టాలని ఏఐఎంఐఎం నంద్యాల పార్టీ తరపున కోరడం జరిగింది. దానితో పాటు రెండోవ భాషా అయినా ఉర్దుని కూడా ప్రోత్సహిస్తూ, అభివృద్ధి చేసే విధంగా చూడాలని కోరడం జరిగింది.ఈ సందర్భంగా నంద్యాల ఏఐఎంఐఎం పార్టీ ఇంచార్జి అక్బర్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని విన్న మంత్రివర్యులు ఎన్ ఎండి ఫరూఖ్ దీని పై సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని మన ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు తెలియజేస్తానని, అలానే దీని గురించి శాసన సభ లో కూడా పెడతారని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరిముల్ల, సమీర్, ఆయుబ్, ఇబ్రహీం, భాష, సమీర్ మోడల్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక ఉన్మాది విధ్వంసం నుండి.. అభివృద్ధి వైపు అమరావతి..!

(మొదటి పేజి తరువాయి)
తరువాత ఆలిండియా సర్వీసెస్ న్యామూర్తుల కోసం నిర్మించిన భవన సముదాయాలు పరిశీలించారు. అనంతరం మంత్రుల నివాస గృహాలు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల, నాలుగవ తరగతి ఉద్యోగుల కోసం నిర్మించిన అపార్ట్మెంట్లను పరిశీలించారు. ప్రతి నిర్మాణం లోపలికి వెళ్లి ఆయా ఫ్లాట్స్ విస్తీర్ణం, ప్లాన్ లో ఉన్న సౌకర్యాలు, డిజైన్ల గురించి అధికారులతో మాట్లాడారు. అనంతరం సీడ్ యాక్సిస్ రోడ్డులో ఉన్న సిఆర్ డిఎ భవనం వద్ద మీడియా సమావేశంలో పాల్గొన్నారు. 'రాజధాని కోసం భూములిచ్చిన రైతులు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. "అనేక సవాళ్లను, కేసులను అధిగమించి 1,631 రోజులు ఆందోళనలు చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో రైతులు ఆందోళనలు విరమించారు. రాజధాని కోసం రైతులు చేసిన పోరాటం…భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. ఏపీ అనే పదంలో ఏ అంటే అమరావతి…పీ అంటే పోలవరం. అమరావతి ప్రజారాజధాని…తెలుగువారికి చిరునామాగా ఉంటుంది. 5 కోట్ల మంది ప్రజలకు దశ, దిశను నిర్దేశిస్తుంది. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గర్వంగా పనులు చేసుకోవచ్చు. కానీ రాజధానిని జగన్ అతలాకుతలం చేశారు. దక్షిణ భారతదేశంలో ఎక్కువనీళ్లు ఉండే నది గోదావరి. పోలవరం నిర్మాణం జరిగి నదులు అనుసంధానం చేస్తే ప్రతి ఎకరాకు నీళ్లివ్వచ్చు. విభజన అనంతరం రాజధాని కట్టుకోవడానికి ఆర్థిక తోడ్పాటు, పోలవరం పూర్తి చేసుకునేందుకు కేంద్రం వెసులుబాటు కల్పించింది. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, అమరావతి రాజధానికి ఆర్థిక సాయం చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చింది." అని సీఎం చంద్రబాబు అన్నారు.
'ప్రజలు కూటమికి ప్రజలు ఏకపక్షంగా ఓట్లు వేశారు…రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద విజయం ఎప్పుడూ రాలేదు. ఒక వ్యక్తి ముఖ్యమంత్రి పదవికి పనికిరాడని ప్రజలు తీర్పు ఇచ్చి 11 సీట్లకు పరిమితం చేశారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి, అర్హతలేని వ్యక్తి సీఎం అయితే రాష్ట్రం ఎంత నష్టపోతుందో గత ఐదేళ్లలో చూశాం. పోలవరం, అమరావతి ప్రాజెక్టులు వ్యక్తిగత అంశానికి సంబంధించినది కాదు…వ్యక్తికి, వర్గానికి, ప్రాంతానికి పరిమితమైనవి కావు. వాటి ద్వారా సంపద సృష్టి జరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది….అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పెరుగుతాయి. ప్రజల్ని సాధికారితవైపు నిలబెట్టవచ్చు. పోలవరం పూర్తి చేసి, నదుల అనుసంధానం పూర్తైతే రాయలసీమ రతనాల సీమ అవుతంది. గత ప్రభుత్వం పోలవరంను గోదావరిలో కలిపింది. పోలవరానికి శాపంగా మారిన వ్యక్తి వల్ల, మూర?త్వం వల్ల ఖర్చు కూడా రెట్టింపు అయ్యింది." అని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.
"ఎవరైనా సీఎం అయితే మంచి కార్యక్రమంతో ప్రజలను మెప్పిస్తారు. కానీ ప్రజావేదిక కూల్చి జగన్ పాలన ప్రారంభించారు. రాజధానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. 16 వేల గ్రామాలు, దేశవ్యాప్తంగా పవిత్రమైన ప్రాంతాల నుండి మట్టి, నీళ్లు తెచ్చి అందరు దేవుళ్ల ఆశీర్వాదాలతో శంకుస్థాపన చేశాం. ప్రధాని నరేంద్రమోదీ కూడా పార్లమెంట్ మట్టి, యమునా నది నుండి నీళ్లు తెచ్చి నాడు మనకు సంఘీభావం తెలిపారు. ఆ మహిమే నేడు రాజధానిని కాపాడింది. తాత్కాలికంగా కొంతమంది అతాలకుతలం చేయాలనుకున్నా ఈ మహత్యం వల్ల మళ్లీ నిలబెట్టుకోగలిగాం" అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.
"రాజధానిలో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి…పైగా ఇష్టానుసారంగా విధ్వంసం చేశారు. పైపులు, ఇసుక దొంగతనం చేయడంతో పాటు రోడ్లను కూడా తవ్వకుపోయారు. ఒక్క బిల్డింగును కూడా పూర్తి చేయలేదు. రోడ్ల నిర్మాణాలన్నీ సగంలో ఆగిపోయాయి. కొన్ని బిల్డింగ్ లు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఐఎఎస్, ఐపిఎస్, జడ్జీల భవనాలు, మంత్రులు భవనాలు, గెజిటెడ్ అధికారుల, నాన్ గెజిటెడ్ అధికారుల భవనాల నిర్మాణం ప్రారంభించాం….ఆ పనులన్నీ అర్ధాంతరంగా నిలిపేశారు. శ్వేతపత్రం విడుదల చేసి రాజధాని ప్రస్తుత పరిస్థితిపై ప్రజలకు వివరాలన్నీ తెలుపుతాం. ప్రజల్లో కూడా గత ప్రభుత్వం విధ్వంసంపై చర్చ జరగాలి. ఏం చేయాలనే దానిపై అధ్యయనం చేయాల్సి ఉంది." అని సీఎం చంద్రబాబు తెలియజేశారు"వైసీపీకి ఓట్లు వేసిన వారు కూడా ఎలాంటి వారికి ఓటు వేశారో ఆలోచించుకోండి. ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉంటే భవిష్యత్ ఎలా ఉంటుందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రభుత్వ విధానాలతోనే ప్రజల జీవితాలు మారుతాయి. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే అభివృద్ధి చేస్తాం. దీర్ఘకాలంలో ప్రజల జీవితాలకు వెలుగునిచ్చే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఓటేయడానికి క్యూలో అర్ధరాత్రి వరకు ఓటర్లు నిలబడ్డారు. ఇతర ప్రాంతాల్లో చిన్న పనులు చేసుకునే వారు కూడా సొంత ఖర్చులు పెట్టుకుని వచ్చి ఓటు వేసి వెళ్లిపోయారు. ఐదేళ్ల విధ్వంసాన్ని భరించలేకనే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓట్లు వేశారు. ఎటువంటి అరమరికలు లేకుండా ప్రతి పనిని ప్రజల ముందు ఉంచుతాం. తప్పుడు పనులు చేసిన వారిని క్షమించం. రౌడీయిజాన్ని అణచివేస్తాం. రాజధానిలో జరిగిన నిర్మాణాలను ఉన్మాదిబారి నుండి దేవుడే కాపాడారు. రుషికొండను చదును చేసి రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ కట్టారు. పర్యావరణానికి విరుద్ధంగా ప్రవర్తించారు. జగన్ లాంటి వ్యక్తులకు రాజకీయాల్లో అర్హత ఉందా అనేది ప్రజల్లో చర్చ జరగాలి. అప్పులు ఎంత చేశారో తెలీదు..అడ్డదిడ్డంగా సంతకాలు పెట్టిన అధికారులు ఎక్కడున్నారో తెలీదు. ఇవన్నీ సరిదిద్దాలి. రాష్ట్రానికి పూర్వవైభం తీసుకొస్తాం..పునర్నిర్మిస్తాం. రాజధాని భూములను కూడా తాకట్టు పెట్టారేమో చూడాలి. లాలూచీ పడే అధికారలు ప్రవర్తన మార్చుకోవాలి. అందరి సహకారం, భాగస్వామ్యంతో రాజధాని నిర్మాణం జరుగుతుంది." అని సీఎం చంద్రబాబు అన్నారు.

# జగన్ అక్రమాస్తుల కేసుపై విచారణకు సిద్ధమవుతున్న సీబీఐ కోర్టు.!

(మొదటి పేజి తరువాయి)
కేసుల నుంచి తొలగించాలని కోరుతూ జగన్, విజయసాయిరెడ్డి, అయోధ్యరామిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, ధర్మాన ప్రసాదరావు, సబితా ఇంద్రారెడ్డి, జె.గీతారెడ్డి, నిమ్మగడ్డ ప్రసాద్, నిమ్మగడ్డ ప్రకాష్, పి.శరత్ చంద్రారెడ్డి, పి.ప్రతాప్ రెడ్డి, పునీత్ దాల్మియా, జితేంద్ర వీర్వాణి, నిత్యానందరెడ్డి, పీవీ రాంప్రసాద్ రెడ్డి, శ్రీలక్ష్మి, ఎం.శామ్యూల్, బీపీ ఆచార్య, జి.వెంకట్రామిరెడ్డి, మన్మోహన్ సింగ్, వి.డి.రాజగోపాల్, ఎస్.ఎన్.మొహంతి, తదితరులు వేసిన డిశ్చార్జి పిటిషన్లు కోర్టులో పెండింగులో ఉన్నాయి. సీబీఐ కోర్టులో



2013 నుంచి దాఖలైన ఈ డిశ్చార్జి పిటిషన్లు ఇప్పటికీ తేలడం లేదు.
సుదీర్ఘ వాదనలు కొంత వినగానే జడ్జీలు బదిలీ కావడంతో, మళ్లీ మొదట్నుంచి ప్రారంభమవుతున్నాయి. ఇలా పదకొండేళ్లలో ఏడుగురు జడ్జిలు బదిలీ అయ్యారు. ఇటీవల బదిలీ అయిన జడ్జి సీహెచ్.రమేష్ బాబు 2022 మే 4 నుంచి సుదీర్ఘంగా వాదనలు వినడంతో విచారణ దాదాపుగా కొలిక్కి వచ్చింది. రెండేళ్ల పాటు సుదీర్ఘంగా వాదనలు విని తీర్పు వెల్లడించబోయే సమయంలో రమేష్ బాబు కూడా బదిలీ అయ్యారు. రేపటి నుంచి దాదాపు రోజూ విచారణ చేపట్టే అవకాశం ఉందని న్యాయవాదులు భావిస్తున్నారు.సీబీఐ కోర్టులో పెండింగ్లో ఉన్న డిశ్చార్జి పిటిషన్లను పరిష్కారించేందుకు గతంలో గడువు విధించినా ప్రయోజనం లేకపోయింది. వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో పెండింగ్?లో ఉన్న 130కు పైగా డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు పూర్తి అయినా తీర్పు వెలువడలేదు. తీర్పు వెలువరించాల్సిన సమయంలో సీబీఐ కోర్టు న్యాయమూర్తి బదిలీ అయ్యారు. దీంతో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ మళ్లీ మొదటికి వచ్చింది. గత ఏడాది నవంబరు నుంచి ఒక్కదానిలోనూ తీర్పు వెల్లువడలేదు.ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వి.విజయ సాయిరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, గీతారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఐఏఎస్ శ్రీలక్ష్మి, మాజీ ఐఏఎస్ అధికారులు మన్మోహన్‌సింగ్, బీపీ ఆచార్య, శామ్యూల్, జి.వెంకట్రామిరెడ్డి, పలువురు పారిశ్రామికవేత్తలు దాదాపు 130కు పైగా డిశ్చార్జి పిటిషన్లను దాఖలు చేశారు. 2013వ సంవత్సరం నుంచి దాఖలైన డిశ్చార్జి పిటిషన్లపై విచారణ ఇప్పటి వరకు పూర్తికాలేదు.

# చెమ్మగిల్లిన చంద్రబాబు కళ్లు

## మట్టిని ముద్దాడి అమరావతికి సాష్టాంగ వందనం చేసిన సీఎం.

**-జగన్ విధ్వంస పాలనకు నాందిపడిన ప్రజావేదిక కూల్చివేత ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి పర్యటన ప్రారంభమైంది.**
**-ఐదేళ్ల పాటు వైసీపీ చేసిన నిర్లక్ష్యం అడుగడుగునా దర్శనమిస్తుండగా అమరావతి పునర్నిర్మాణమే లక్ష్యంగా, సీఎం రాజధానిలో పర్యటిస్తున్నారు.**
**-గతంలో చేపట్టిన నిర్మాణాలు ఆయన పరిశీలిస్తూ ముందుకెళ్తున్నారు.**

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 20:
ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనుల్ని, వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలనే పట్టుదలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు. ఇందులో భాగంగా తొలుత జగన్ విధ్వంసాన్ని అంచనా వేయాలనే ఉద్దేశంతో రాజధానిలో పర్యటిస్తున్నారు. ఉదయం 11:00 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఆయన పర్యటన ప్రారంభమైంది.
తొలుత జగన్ కక్షగట్టి కూల్చేయించిన ప్రజావేదికను చంద్రబాబు సందర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే, కూల్చేసిన ప్రజావేదిక శిథిలాలలను ముఖ్యమంత్రి పరిశీలించారు. కూల్చివేతలకు చిరునామాగా నిలిచిన జగన్ ప్రభుత్వంలో, కనీసం ఆ శిథిలాలను కూడా తొలగించలేదు. చంద్రబాబు కూడా జగన్ చేసిన విధ్వంసం అందరికీ తెలియాలనే ఉద్దేశంతో, ప్రజావేదిక శిథిలాల తొలగింపు చేపట్టమని ఇటీవల తేల్చిచెప్పారు.
ప్రజావేదిక పరిశీలన అనంతరం చంద్రబాబు కరకట్ట రోడ్డు మీదుగా సీడ్ యాక్సెస్? రహదారిపైకి వెళ్లారు. దారి పొడవునా ఎక్కడా తట్ట మట్టిసిన పరిస్థితి లేకపోవడాన్ని కళ్లారా చూశారు. రాజధాని రైతుల ఆవేదనను కళ్లకు కడుతూ భూములన్నీ, జగన్



అరాచకానికి సాక్ష్యాలుగా నిలవడాన్ని గమనించారు. సీడ్ యాక్సెస్? రహదారి మీదుగా చంద్రబాబు అమరావతి శంకుస్థాపనన జరిగిన ఉద్ధండరాయునిపాలెం ప్రాంతానికి బస్సులో వెళ్లారు.
అమరావతి శంకుస్థాపన ప్రాంతానికి వెళ్లిన చంద్రబాబు నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. గొప్ప సంకల్పంతో నిర్మించ తలపెట్టిన అతిరథ మహారథులను ఆహ్వానించిన చోట, ప్రస్తుతం పాడుబడిన ప్రాంతంగా మారిన పరిస్థితిని చూశారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి మట్టిన భద్రపరిచిన చోటుకు వెళ్లిన ఆయన సాష్టాంగపడి నమస్కరించారు. ఆ తర్వాత పైకి లేచి వందనం సమర్పించారు. అభివృద్ధికి చిరునామాగా నిలవాల్సిన ప్రాంతం, దారుణ పరిస్థితుల్లో ఉండటంపై తీవ్ర ఆవేదన చంద్రబాబు కళ్లలో వ్యక్తమైంది. అనంతరం శంకుస్థాపన జరిగిన చోటుకు వెళ్లి శిలాఫలకాలను పరిశీలించారు.
తరువాత ప్రజా ప్రతినిధుల క్వార్టర్లను సీఎం సందర్శించారు. నిర్మాణం పూర్తైన గదులను చూసిన చంద్రబాబు, తానొస్తున్నానని ప్రత్యేక ఏర్పాట్లేం చేయలేదు కదా అని అధికారులను ప్రశ్నించారు. రాజధాని నిర్మాణ పనుల వాస్తవ పరిస్థితి తనకు తెలియాలని అన్నారు. అటువంటిదేం లేదని అధికారులు సీఎంకు వివరించారు. క్వాలిటీ మెటిరీయల్ వాడటం వల్ల సరైన నిర్వహణ లేకున్నా చెక్కుచెదర లేదని ఎమ్మెల్యే కొలికిపూడి తెలిపారు. బాత్రూలంతో సహా వివిధ గదుల్ని పరిశీలించారు. ప్రజా ప్రతినిధుల క్వార్టర్లు దాదాపు 80-90 శాతం మేర నిర్మాణం పూర్తయ్యాయి.
ఐకానిక్ సెక్రటేరీయేట్, అసెంబ్లీల నిర్మాణ ప్రాంతాలను చంద్రబాబు పరిశీలించారు. నీట మునిగిన ఐకానిక్ సెక్రటేరీయేట్, అసెంబ్లీల ప్రాంతం పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ విధ్వంసాన్ని మించిన నష్టం చేసిందని ధ్వజమెత్తారు. అదే విధంగా జడ్జీల బంగ్లాలను చంద్రబాబు పరిశీలించారు. సీఆర్డీఏ ప్రాజెక్టు ఆఫీస్ 77 శాతం, ఎన్జీవో హౌసింగ్ 62 శాతం, గెజిటెడ్ ఆఫీసర్ల హౌసింగ్ 60 శాతం, ఉన్నతాధికారుల బంగ్లాలు 28.50 శాతం, జడ్జీల, మంత్రుల బంగ్లాలు 27.30 శాతం పూర్తయ్యాయని చంద్రబాబు పేర్కొన్నారు.
షెడ్యూల్ ప్రకారం పర్యటన ముగించుకున్న చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించేందుకు సీఆర్డీయే కార్యాలయానికి చేరుకున్నారు. అయితే నిర్మాణం పూర్తయిన 4వ తరగతి ఉద్యోగుల భవనాలు పరిశీలించలేదని గుర్తించిన అనంతరం వాటి పరిశీలనకు మళ్లీ వెనక్కి బయలుదేరి వెళ్లారు. గ్రూప్ - డి హౌసింగ్ 75 శాతం మేర పూర్తయినట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు. దాదాపు రెండున్నర గంటల పాటు రాజధాని నిర్మాణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రజల జీవితాల్లో వెలుగు తెచ్చే బాధ్యత ప్రధాని మోదీపైనా, తన పైన ఉందని చంద్రబాబు తెలిపారు. అమరావతికి ఎంత నష్టం జరిగిందనే విషయమై అంచనా వేస్తామన్నారు.

# అంజుమన్ స్కాలర్షిప్ కు దరఖాస్తు చేసుకోండి

**-ప్రతిభ కనపరిచిన ప్రతి పేద ముస్లిం విద్యార్థికి రూ.3000.**

**-అంజుమన్ అధ్యక్షులు ఖుద్దూస్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**

ప్రతి సంవత్సరం లాగే ఈ విద్యా సంవత్సరం అనగా 2024 లో పదవ తరగతిలో ప్రతిభ కనపరిచి, మంచి మార్కులు సాధించిన ప్రతి పేద ముస్లిం విద్యార్థిని విద్యార్థులకు నంద్యాల అంజుమన్ సంస్థ రూ.3000 నగదు చెక్కు పంపిణీ చేయనున్నట్లు అంజుమన్ ఇస్లామియ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. ఈ అవకాశాన్ని నంద్యాల పేద ముస్లిం విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఖుద్దూస్ తెలపారు. విధ్యార్థులు నంద్యాల పట్టణవాసులై ఉండాలని, ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆర్ టి సి బస్టాండ్ ఎదురుగా గల అంజుమన్ లో అప్లికేషన్లు తీసుకుని, ఆధార్ కార్డు, ఎస్ ఎస్ సి మార్కుల మెమో జిరాక్స కాపీలు, కళాశాలలో చదువుతున్నట్లు ధృవ పత్రం ,రెండు ఫోటోలు జత చేసి 15-07-2024 లోపల పూర్తి చేసిన దరఖాస్తులను అంజుమన్ లోనే ఇవ్వాలని ఖుద్దూస్ తెలిపారు. 21-6-24 నుండి దరఖాస్తులు పంపిణీ చేస్తున్నట్లు, పైకం పంపిణీ తేది మీడియా ద్వారా తెలుపబడనని ఖుద్దూస్ తెలిపారు.

# పర్యావరణ సమతుల్యతను కాపాడాలి.

**-ప్రకృతి రక్ష.. మానవాళి రక్ష..**

**-చేయి చేయి కలుపుదాం.. మొక్కలు నాటుదాం.**




ఆంధ్ర ప్రగతి మహానంది, జూన్ 20:

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, పర్యావరణ సమతుల్యతను కాపాడాలని ఎంఈఓ రామసుబ్బయ్య, నేషనల్ గ్రీన్ కోర్ సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి, పేర్కొన్నారు. గురువారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను విద్యార్థులకు దత్తత ఇచ్చి, వాటిని సంరక్షంచాలని తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణను ఒక భాగంగా చేసుకోవాలని, మనవంతు బాధ్యతగా కాలుష్యాన్ని, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలన్నారు. మొక్కలను పెంచడాన్ని, పంచడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని, అప్పుడే ముందు తరాలకు మంచి వాతావరణాన్ని అందించిన వాళ్లమవుతాం అని అన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై, అవగాహన కల్పించి, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. అడవి శాఖ అధికారులు తమ వంతు సహకారం అందిస్తారన్నారని, ఈ అవకాశాన్ని ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినియోగించుకొని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ వి సుబ్బారాయుడు, హరిత, శోభ బాయ్, శ్రీకాంత్, సుధా కుమారి, మాధవిలత, పార్వతమ్మ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.ద

# ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను సన్మానించిన మాజీ హెచ్ ఆర్ డి సెక్రెటరీ, ఇస్మాయిల్



ఆంధ్ర ప్రగతిశిరివెళ్ళజూన్20:

ఆళ్లగడ్డ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడంతో శిరివెళ్ళ మాజీ హెచ్ ఆర్ డి ఎం ఎం డి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ భూమా నివాసంలో ఎమ్మెల్యే అఖిల ప్రియను కలిసి శాలువలతో పూలమాలవేసి సన్మానించి బోకే అందజేసి సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ అఖండ మెజార్టీతో గెలుపొందినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.సార్వత్రిక ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలుపొందినందుకు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శిరివెళ్ళ మండల కేంద్రంలోని నిలిచిన పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, పలు అభివృద్ధి పనులు, మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలు గురించి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఇసుప్ ఖాన్, బిసి హమాద్ హుస్సేన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ కంప్యూటరీకరణ. రైతుల నుండి ఈకేవైసీ స్వీకరణ -సీఈఓ కానాల దస్తగిరి




ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జూన్ 20:

మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) ఉన్నతాధికారులు కంప్యూటరీకరణ చేస్తున్నారని సొసైటీ సీఈఓ కాణాల దస్తగిరి పేర్కొన్నారు. శిరివెళ్ల కేడీసీసీ బ్యాంక్ ఆవరణంలో ఆయన బుధవారం మాట్లాడుతూ బోయలకుంట్ల సొసైటీలో ఓటు హక్కు కలిగిన ప్రతి రైతన్న ఈ కేవైసీ నమోదు చేసుకొనేందుకు ఆధార్ పాన్ కార్డ్, పొలం పాస్ పుస్తకం,మూడు ఫోటోలు, జిరాక్స్ నకలు కాపీలు మరియు నామినిగా ఉన్నవారి ఆధార్ జిరాక్స్ పత్రాలు సొసైటీలో అందజేయాలని సీఈవో దస్తగిరి పిలుపునిచ్చారు. సొసైటీలోఓటు హక్కు కలిగిన ప్రతి రైతు ఈ నెల 30వ తేదీ లోపు జిరాక్స్ నకలు పత్రాలు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96039 43776 నంబర్ కు ఫోన్ తగిన సమాచారం తెలుసుకోవచ్చునని అన్నారు.

## 2023-24 రబీలో కరువు పరిస్థితిపై

# కేంద్ర కరువు బృందం సమీక్ష






ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 20:

2023-24 రబీ సీజన్ లో ఏర్పడిన కరువు పరిస్థితులను జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు కేంద్ర కరువు బృందానికి వివరించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కరువు పరిస్థితుల అధ్యయనంపై కేంద్ర కరువు బృందం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కరవు పరిస్థితులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండేచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్ (ఐఏఎస్), తాగు నీరు, పారిశుధ్యశాఖ డిప్యూటీ అడ్వైజర్ (పీహెచ్ఈ) ఆషిష్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద కుమార్ సోనిలకువివరించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023-24 రబీకి సంబంధించి 13 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 33 శాతం మించి అధిక పంట నష్టం 59,207 హెక్టార్లలో పప్పు సెనగ, మినుము, కంది, పొగాకు, జొన్న మొక్కజొన్న తదితర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పంట సాగు చేసిన 58,011మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని కలెక్టర్ వివరించారు. 2023-24కు సంబంధించి అక్టోబర్ నుంచి మే నెల వరకు మైనస్ 21.14 శాతం వర్షపాతం తక్కువగా నమోదు అయిందన్నారు. భూగర్భ జలాలకు సంబంధించి 2023 మే నెలలో 6.84 మీటర్ల లోతులో ఉండగా, నవంబర్ నాటికి 7.01 మీటర్లకు, మే 2024 నాటికి 11.42 మీటర్ల లోతుకు వెళ్లాయని కలెక్టర్ వెల్లడించారు. భూగర్భ జలాలు ఎండిపోవడం కారణంగా నీటి వనరులు లేక టాంకర్ల ద్వారా నీటిని రవాణా చేశామన్నారు. రబీ 2023-24 లో తీవ్రమైన కరువు పరిస్థితుల కారణంగా జిల్లాలో 58,011 మంది రైతులకు సంబంధించి 59,207 హెక్టార్లకు ఎన్.డి.ఆర్.ఎఫ్ నిబంధనల ప్రకారం 57.30 కోట్లు ఇన్పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ, అర్బన్ వాటర్ సప్లై నష్టం వివరాలను పూర్తిగా తెలియజేశారు. ఉపాధి హామీ కింద వందరోజుల పని దినాల కల్పన, అదనంగా 50 రోజుల పనుల కల్పన, తదితర అంశాలను వివరించారు.ఈ సందర్భంగా ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం అధికారులు మాట్లాడుతూ కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి తయారు చేసిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. రబీ 2023-24లో కరువు పరిస్థితిపై ఆరా తీస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూగర్భ జలాలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి వివరాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఎంత మంది 100 రోజుల పని పూర్తి చేసుకున్నారు, గత ఐదేళ్లలో 100 రోజుల పని పూర్తి చేసిన మండలాలు ఎన్ని ఉన్నాయి, ఉపాధి హామీ కింద అదనంగా మరో 50 రోజుల పని దినాలు ఎక్కడెక్కడ కావాలని అడుగుతున్నారు, గత ఏడాది వేజ్ ఎంప్లాయిమెంట్, క్రాఫ్ కటింగ్ ఎక్స్పరిమెంట్, పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. . ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఆర్ డబ్ల్యు ఎస్ ఈ మనోహర్, భూగర్భ జల శాఖ డిడి రఘురాం, డిఆర్ఓ మల్లికార్జున రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటరమణయ్య, డ్వామా పిడి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కుందూ నది బ్రిడ్జి పనులను పరిశీలించిన

## టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్





ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:

నంద్యాల పట్టణం నుండి నందమూరి నగర్ పోయే రోడ్డులో నిర్మాణంలో ఉన్న కుందు బ్రిడ్జిని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ వారి బృందంతో పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు 2017 లో కుందూ నది పై బ్రిడ్జికి శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారని, కానీ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పట్టించుకోకపోవడంతో ఇన్ని సంవత్సరాలైన బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదన్నారు.గత ఐదేళ్లుగా 3 కాంట్రాక్టర్లను మారిన నిర్మాణం పూర్తి కాలేదంటే గత ఎమ్మెల్యే పనితీరు అర్ధమవుతుందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల 30 గ్రామాల ప్రజల రాకపోకలకు సులభతరం అవుతుందని . ప్రజలకు ఇంత అవసరమైన బ్రిడ్జి నిర్మాణాన్ని వలస నాయకులు గాలికొదిలేసారని, కానీ ఇప్పుడు స్థానికుడైనా ఎన్ఎండి ఫరూక్ గారి నాయకత్వంలో బ్రిడ్జి నిర్మాణాన్ని అతి త్వరలో పూర్తి చేస్తామన్నారు. అనంతరం బ్రిడ్జి కాంట్రాక్టర్ తో మాట్లాడి అడ్డంకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సమస్యలను మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకొని వెళ్లి పనులు పూర్తి చేస్తామని తెలియజేయడం జరిగింది. బ్రిడ్జి నిర్మాణం కోసం అవసరమైతే తమ కుటుంబానికి చెందిన భూములను సైతం ప్రభుత్వాన్నికి అందిస్తామని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భారీగా పాల్గొన్నారు.

# ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:

ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందని ప్రతి రెవెన్యూ ఉద్యోగి రోజురోజుకు విజ్ఞానాన్ని పెంపొందించుకొని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు వుంటాయని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో మొదటి సారిగా రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాయింట్ కలెక్టర్ టి .రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పద్మజ, ఆర్డీవోలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, దాసు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు, తాసిల్దారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో ఏ సంక్షోభం ఎదురైన తొలుత రెవెన్యూ డిపార్ట్మెంటే స్పందించి సంబంధిత సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని పనిచేయాల్సి ఉంటుందని... ఈ మేరకు ప్రతి ఉద్యోగి రోజురోజుకు జ్ఞానాన్ని వృద్ధి చేసుకుంటూ క్రమశిక్షణతో పనిచేస్తే అమోఘమైన ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి సబ్జెక్టుపై పరిపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహిస్తూ అంకితభావంతో పనిచేస్తే దానంతటదే పై స్థాయిఅధికారుల నుంచి, ప్రజల నుంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. గత నాలుగు నెలల కాలంలో శివరాత్రి మొదలుకొని ఇటీవల జరిగిన సాదరణ ఎన్నికల వరకు కిందిస్థాయి ఉద్యోగి నుండి ఉన్నత స్థాయి అధికారి వరకు మెరుగైన రీతిలో విధులు నిర్వహించి అన్ని కార్యక్రమాలు విజయవంతం చేశారని కలెక్టర్ ప్రశంసించారు. ప్రజాస్వామ్యంలో ఉన్నప్పుడు నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుందని ఈ మేరకు నిబద్ధతతో విధులు నిర్వహిస్తే అందరి మన్ననలను పొందవచ్చన్నారు. కష్టపడి పని చేస్తే ప్రతికూల పరిస్థితులు ఉండవని తెలిపారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు రెవెన్యూ సిబ్బందికి విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులచే ఖచ్చితమైన శిక్షణ కార్యక్రమాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.



జాయింట్ కలెక్టర్ టి.రాహూల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సంస్కరణలపై అవగాహన పెంచుకొని విధులు నిర్వహించాలని రెవిన్యూ సిబ్బందిని సూచించారు. అవిశ్రాంతంగా పనిచేస్తు పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ కుటుంబంపై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రతి ఉద్యోగి సంబంధిత రెవెన్యూ అంశాల గురించి నేర్చుకోవాలనే తపన, ఆసక్తి ఉండాలన్నారు. విధులతోపాటు క్రీడలు, రిక్రియేషన్, గెట్ టుగెదర్ యాక్టివిటీస్ ఏర్పాటు చేసుకొని అందరితో సంభాషిస్తూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. రెవెన్యూ ప్రాథమిక అంశాలపై ఖచ్చితమైన అవగాహన కలిగి డ్రాఫ్టింగ్ నేర్చుకోవాలన్నారు. తాను ఉద్యోగంలో చేరినప్పుడు వీఆర్ఏ, ఆర్ఐ, తాసిల్దార్ గా కొంతకాలం పని చేసి అనేక సవాళ్ళు ఎదుర్కోవటంతో పాటు పని నేర్చుకోవడం జరిగిందన్నారు. పూర్వ అనుభవం గల వ్యక్తుల డాక్యుమెంట్లను పరిశీలించుకుంటూ విధుల్లో నైపుణ్యత పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అంతకుముందు జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత రెవెన్యూ సిబ్బంది తదితరులు తమ అనుభవాలను సిబ్బందితో పంచుకున్నారు. అనంతరం రెవెన్యూ సర్వీస్ లలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ పంపిణీ చేశారు.

# కేజీబీవి పాఠశాలల్లో సీట్లు పెంచాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:
నంద్యాల జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న అవకతవకలపై జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయుడు మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రతి కేజీబీవీ పాఠశాలల్లో 20 సీట్లను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కేజీబీ పాఠశాలలో చదువుకోవడానికి పేద, మధ్యతరగతి విద్యార్థులు చాలామంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ వారికి సీట్లు రాక విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే ఆపివేసి వెను తిరుగుతున్నారని నిరాశపడుతున్నారని వారు తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రతి మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాలల్లో ప్రతి పాఠశాలకు 20 సీట్లు అదనంగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా దరఖాస్తు చేసుకున్నటువంటి విద్యార్థులకు సీట్లు రాక పేద విద్యార్థులు తమ విద్యను మద్దతు మధ్యలోనే ఆపివేసే అటువంటి పరిస్థితి నెలకొంటుంది కాబట్టి మన నంద్యాల జిల్లాలో ఉన్నటువంటి ఎమ్మెల్యేలు, మినిస్టర్లు ఆలోచన చేసి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కేజీబీవీ పాఠశాలల్లో సీట్లను కచ్చితంగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సీట్లను సాధించే దిశగాఆలోచన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.
అంతేకాకుండా నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కేజీబీ పాఠశాలల్లో విద్యార్థులకు వచ్చినటువంటి సీట్లను విద్యార్థులు తల్లిదండ్రులు తెలియని వాళ్ళగా భావించి అక్కడ పనిచేస్తున్నటువంటి ఎస్ఓలు సీటు వచ్చిన విద్యార్థులకు అన్యాయం చేసి రెకమండేషన్ ఉన్నటువంటి విద్యార్థులకు ఆ సీట్లను ఇచ్చి దరఖాస్తు చేసుకొని సీటు పొందిన విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఈ విషయం పైన జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ స్పందించి కేజీబీవీ పాఠశాలల్లో జరుగుతున్నటువంటి అవకతవకలపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి సురేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్, సురేంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో ఇళ్లను పరిశీలించిన

## నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 19:
పట్టణ పేదలకూ సొంతింటి కలను నిజం చేయాలని రాష్ట్రంలో ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) ఇళ్ల నిర్మాణాలు తెలుగుదేశం ప్రభుత్వ హయంలో 80 శాతం పూర్తి చేసిందని . జీ౦3 విధానంలో టిడ్కో ఇళ్లను తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిందని ప్రస్తుతమున్న నగరాలు, పట్టణాలకు సమీపంలో అనువైన ప్రాంతాల్లో నిర్మితమైన ఈ అపార్ట్‌మెంట్లు సరికొత్త పట్టుణాలులను తలపించేలా తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వీటిని లబ్దిదారులకు అందజేయాలని చంద్రబాబు అనుకుంటున్న తరుణంలో 2019 లో ఎన్నికల కోడ్ రావడంతో వీటి పంపిణీ నిలిచిపోయిందని తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్సిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పంపిణీ చేయకుండా కేవలం వాటికి రంగులు పూసుకుంటూ కాలయాపన చేసిందని నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు.
ఈ సందర్భంగా స్థానిక నంద్యాల ఎస్సార్ బీసీ కాలనీ , వైయస్ నగర్ లలో ఉన్న టిడ్కో ఇళ్లను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ వారి బృందంతో గురువారం పరిశీలించడం జరిగింది.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ టిడ్కో ప్రాజెక్టులో చంద్రబాబు ప్రభుత్వం మొత్తం 3,13,832 ఇళ్ల నిర్మాణం తలపెట్టిందని అప్పటి మున్సిపల్ మంత్రి పి.నారాయణ ప్రత్యేక శ్రద్ధతో పట్టణ శివార్లలో అపార్ట్‌మెంట్లు నిర్మించారని మూడు కేటగిరీల్లో ఇళ్ల నిర్మాణం తలపెట్టారని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణంతో లక్షల మంది పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందని భావించారని దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఎంపిక చేసుకున్న కేటగిరీలో ఇల్లు మంజూరు చేశారని. ఇళ్ల నిర్మాణాలను కూడా గత తెలుగుదేశం సర్కారు దాదాపు పూర్తి చేసిందని . అప్పట్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఆగిపోయిందని అయితే.. వైసీపీ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఉచితంగా టిడ్కో ఇళు ్ల ఇస్తామని జగన్ అప్పట్లో ఆర్భాటంగా ప్రకటించారని వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయికే ఇస్తామని పేర్కొందని 365 చదరపు అడుగుల ఇళ్లకు లబ్ధిదారులు రూ.50 వేలు డిపాజిట్ కట్టగా, ఈ సర్కార్ రూ.25 వేల డిపాజిట్ చెల్లిస్తే చాలని ప్రకటించిందని 430 చదరపు అడుగుల ఇళ్లకు రూ.లక్షకు బదులు రూ.50 వేలు చెల్లిస్తే చాలు అంటూ హడావుడి చేసిందని డిపాజిట్లలో సగభాగం తిరిగి ఇచ్చేయాలని ఆదేశాలూ ఇచ్చారని అయితే, ఇది అమలు కాలేదని లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సుమారు రూ.400 కోట్ల మేర డిపాజిట్లు ప్రభుత్వం తన వద్దే ఉంచుకుందని దీనికోసం లబ్ధిదారులు స్పందనలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా ప్రభుత్వం పట్టించుకో లేదన్నారు ... గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తవగా... కేటాయింపు విషయంలో వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసిందని మూడుసార్లు వాయిదా వేసి లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు . 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఐదు సంవత్సరాలు పూర్తయిన ఇళ్లను సైతం లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు . అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయలేదని దీంతో పలు చోట్ల పక్కా భవనాలు సైతం నిర్వహణ లేక పిచ్చిమొక్కలు మొలిచి పాడుపడ్డాయిని . అయితే, వైసీపీ ఇతర పథకాల మాదిరిగానే వీటికీ దుస్థితి ఏర్పడిందని మౌలిక వసతులు కల్పించకుండా భవనాలకు పార్టీ రంగులు పులిమేశారని తాగునీరు, రోడ్లు తదితర కనీస వసతులు కూడా కల్పించకపోవడంతో లబ్ధిదారులు 'ఆ ఇళ్లు మాకొద్దు' అనే పరిస్థితికి తీసుకొచ్చారని ఈఎంఐలు చెల్లించాలని కొన్ని చోట్ల బ్యాంకర్లు లబ్ధిదారులకు నోటీసులిచ్చారని గత ఏడాది నుంచి బకాయిలు చెల్లించని కారణంగా లబ్ధిదారుల ప్లాట్లు స్వాధీనం చేసుకుంటున్నట్లు సంబంధిత బ్యాంకు వార్తా పత్రికల్లో స్వాధీనతా ప్రకటన పేరుతో బహిరంగ ప్రకటన కూడా చేసిందిని కొన్ని చోట్ల అధికారులే లబ్ధిదారుల వద్దకు వెళ్లి.. ఇళ్లు తీసుకుని ఈఎంఐలు చెల్లించాలని సూచించారని పూర్తిగాని, మౌలికవసతులు కల్పించని ఆ ఇళ్లలో ఎలా చేరాలంటూ లబ్ధిదారులు వాటిని తీసుకోడానికి వెనకాడారని 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అవి వచ్చే లోగా టిట్కో ఇళ్లు అవాటిని తమ ఖాతాలో వేసుకోవాలని గేటెడ్ కమ్యూనిటీలను తలపిస్తున్న టిడ్కో నివాసాలకు 'వైఎస్సార్ జగనన్న నగరాలు'గా నామకరణం చేసిందని అక్కడున్న వాటర్ ట్యాంకులు క్లీన్ చేయకపోవడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలకు చర్మవ్యాధులు కూడా రావడం జరిగింది బాధితులు తెలియజేశారని. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తయిన టిట్కో గృహాలకు వైసీపీ ప్రభుత్వం బులుగు రంగు వేసుకుందన్నారు. ఈ టిడ్కో ఇళ్లకు తాగునీరు, డ్రైనేజీ, ఎస్టీపీ, విద్యుత్ సదుపాయం, రోడ్లు వంటి అన్ని వసతులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో కల్పించక పోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వీటన్నిటిని త్వరలోనే పూర్తి చేసి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందజేస్తామన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వాకా శివ శంకర్ యాదవ్ కౌన్సిలర్ నాగార్జున మామిడి నాగరాజు దేరెడ్డి శివ నాగిరెడ్డి బుగ్గ రాముడు కేవల్ దిలీప్ రెడ్డి మరాఠీ సూరి షేక్ మున్నా, ప్రసాద్,గాలి చంద్రశేఖర్ సుధాకర్ విగ్నేష్ ఖాదర్ కింగ్ సాయి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ నుండి అమరావతికి ప్రభూత్వ కార్యాలయాలను తరలించవద్దు

## -రాయలసీమ రవికుమార్,రాష్ట్ర అధ్యక్షులు.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు జూన్ 20:**




గత ప్రభుత్వంలో రాయలసీమ కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కార్యాలయాలను కర్నూలు నుండి అమరావతికి తరలించవద్దని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న ప్రభూత్వాన్ని డిమాండ్ చేశారు.కర్నూలు నగరంలోని స్థానిక ఆర్వీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం మేరకు రాష్ట్ర రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేయవలసివున్న పాలకులు నిర్లక్ష్యం కారణంగా తరతరాలుగా రాయలసీమ వివక్షకు గురవుతూనేవున్నదని అయితే గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం మేరకు రాష్ట్రస్థాయి కార్యాలయాలైన మానవహక్కుల కమిషన్ కార్యాలయం,లోకాయుక్త కార్యాలయం,విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ కార్యాలయం,వక్ఫ్ బోర్డు కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేసారని అయితే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఆయా కార్యాలయాలను అమరావతికి తరలించాలని నిర్ణయించిదని దీనిని రాయలసీమ సంఘాలకు తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఇప్పటికే రాష్ట్ర రాజధాని, నీటి ప్రాజెక్టులు, న్యాయబద్ధమైన నీటివాట కోల్పోయి కరువు వలసలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతం ఏర్పాటైన ప్రభుత్వ కార్యాలయాలను తరలించి ప్రస్తుత ప్రభుత్వం రాయలసీమకు మరింత అన్యాయం చేసే ఆలోచనలను మానుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు కేవలం అమరావతి నిర్మాణంతో సాధ్యమవుతాయని ప్రభుత్వం భావించడం రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలపై వివక్ష చూపించడమే అవుతుందని రాష్ట్రంలోని అన్నిప్రాంతాల అభివృద్ధి దిశగా కొత్త ప్రభుత్వం పనిచేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి, హక్కుల పోరాట సమితి నాయకులు విద్యాసాగర్, నాగేష్, అశోక్,మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

# మహానందిలో ఘనంగా రెవెన్యూ డే.



ఆంధ్ర ప్రగతి మహానందిజూన్ 20:
మహానందిలోని తాసిల్దార్ కార్యాలయంలో ఘనంగా మొట్టమొదటి రెవెన్యూ డేను గురువారం నిర్వహించారు. తాసిల్దార్ రామచంద్రుడు ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించారు. తాసిల్దార్ రామచంద్రుని తో పాటు విశ్రాంత తాసిల్దార్ జనార్దన్ శెట్టి బుక్కాపురం గ్రామానికి చెందిన రైతు నాగరాజును రెవెన్యూ డే సందర్భంగా సిబ్బంది సన్మానించారు. తాసిల్దార్ రామచంద్రుడు మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థ ఏర్పడిన నాటి నుండి మొదటిసారిగా రెవెన్యూ డే ఉత్సవాలను జరుపుకోవడం ఆనందకరంగా ఉందన్నారు. ప్రజలకు రెవెన్యూ వ్యవస్థ తో విడదీయరాని బంధం ఏర్పడి ఉందన్నారు. డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి మనిషి పుట్టినప్పటి నుండి మరణించేవరకు రెవెన్యూ శాఖ సహాయ సహకారాలు ముడిపడి ఉన్నాయన్నారు. రెవెన్యూ సిబ్బంది ప్రజల అవసరాల నిమిత్తం కార్యాలయాలకు వస్తే వారికి సంబంధించిన ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని పెండింగ్లో ఉంచవద్దని సూచించారు. సమస్య ఏదైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొని పోయి త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో ఏ వ్యవస్థకులేని అనుబంధం రెవెన్యూ వ్యవస్థకు ఉందని గ్రామస్థాయి నుండి మండల, తాలూకా, జిల్లా స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థకు సిబ్బంది ఉందని ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విశ్రాంత తహసిల్దార్ జనార్ధన్ శెట్టి మాట్లాడుతూ మొగల్ చక్రవర్తుల కాలం నుండి రెవెన్యూ వ్యవస్థ అమల్లో ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం రెవెన్యూ వ్యవస్థ గుండె లాంటిదని ఈ వ్యవస్థలో పనిచేస్తున్నామంటే గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం కేకును కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సురేంద్ర నాథ్ రెడ్డి, ఆర్ ఐ శ్వేత సూపరింటెంట్ రామకృష్ణ వీఆర్వోలు చలమయ్య సురేంద్ర శివ వీఆర్ఏలు సిబ్బంది పాల్గొని గ్రూప్ ఫోటో దిగారు.

## నంద్యాల నందమూరి నగర్ పై

# దృష్టి పెట్టండి మంత్రి గారు

## -కె ప్రసాద్ సిపిఐ పట్టణ కార్యదర్శి నంద్యాల.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**
నంద్యాల టిడిపి సీనియర్ నాయకులు ఎన్ ఎండి ఫారుక్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ఎన్నికైనందుకు నంద్యాల సిపిఐ పట్టణ సమితిగా అభినందనలు. నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన నందమూరి నగర్ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న అభివృద్ధికి నోచుకోవడం లేదు, ఎంతమంది ఎమ్మెల్యేలు వచ్చినా ఈ ప్రాంతానికి కౌన్సిలర్లు ఎన్నిక కాబడ్డ ఇప్పటికీ నందమూరి నగర్ లో 90 శాతం లో మౌలిక వసతులు లేక ఇక్కడి ప్రజలు దోమలతో విషపురుగులతో సిసి రోడ్లు లేక డ్రైనేజీలు లేక సరైన వీధి దీపాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.నంద్యాల పట్టణంలోని పాతపట్నం నడిగడ్డ. హరిజనవాడ. బైటి పేట. ప్రాంతాలు 1988. 1995 మధ్యలో రెండుసార్లు కొట్టాలు అగ్నికి ఆహుతి అయి ప్రజలు సర్వం కోల్పోవడం జరిగింది. ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. అప్పటి టిడిపి ప్రభుత్వంలో మీరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నందమూరి నగర్ ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో నివాసాలకు స్థలాలు కేటాయించి కొంతవరకు హౌసింగ్ ద్వారా ఇల్లు కట్టడం కూడా జరిగింది. అప్పటినుండి ఇప్పటివరకు జనాభా పెరుగుతుంది కానీ మౌలిక వసతులు జరగడంలేదు అప్పటినుండి ఇప్పటివరకు దళారుల చేతిలో నుండి కొన్ని ప్లాట్లు చేతులు మారుతున్నాయి. కానీ ఇల్లు కట్టించుకోవడం లేదు ఆ ఖాళీ స్థలాలలో కంప చెట్లు ముళ్ళ పొదలు వర్షపు నీరు తో ఆ ప్రాంతవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు మరలా మీరు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కావడం జరిగింది అప్పటి స్వర్గీయ నందమూరి తారకరామారావు పేరు ఆ కాలనీకి పెట్టడం జరిగింది. ఆ నాయకుని పేరు నిలవాలంటే వెంటనే మీరు ఈ ప్రాంతం పైన దృష్టి పెట్టి సిసి రోడ్లు డ్రైనేజీలు వీధి దీపాలు అన్ని మౌలిక వసతులు కల్పించి ఈ ప్రాంత వాసులను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

# మహానందిలో ప్రముఖులు పూజలు.



ఆంధ్ర ప్రగతి మహానంది, జూన్ 20:
మహానంది పుణ్యక్షేత్రంలో నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, న్యూఢిల్లీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్పెండిచర్ చిన్ మే గోట్ మరి, న్యూఢిల్లీ డిప్యూటీ అడ్వైజర్ ఆసీస్ పాండే, న్యూఢిల్లీ రూరల్ డెవలప్మెంట్ సెక్రటరీ అరవింద్ కుమార్ గురువారం రాత్రి పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట తహసిల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తాహసిల్దార్ శ్రీనివాసులు, ఆలయ ఏఈవో మధు, తదితరులు పాల్గొన్నారు.

## దేవదాయ శాఖ మంత్రి కి

# మహానందీశుని ఆశీస్సులు



ఆంధ్ర ప్రగతి మహానంది, జూన్ 20:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా ఆనం రామ నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గురువారం మహానంది దేవస్థానం తరుపున ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఏఈవో ఓ.వెంకటేశ్వర్లు, వేద పండితులు రవిశంకర్ అవధాని మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. ఈవో స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేయగా, వేద పండితులు రవిశంకర అవధాని, హనుమంతరాయ శర్మలు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు జనార్ధన శర్మ, తదితరులు పాల్గొన్నారు.